శరణాగతి.. గరుడా చలపతి



స్నపన తిరుమంజనం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడోత్సవం కనులపండువగా జరిగింది. మలయప్ప స్వామి మకరకంఠి, లక్ష్మీహారం వంటి విశేష ఆభరణాలు ధరించి గరుత్మంతుడిపై భక్తులకు ఆశీస్సులు అందించారు. జ్ఞాన వైరాగ్య ప్రాప్తి కోరే మానవులు గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయంటూ భక్తకోటికి పండితులు సందేశాన్నిచ్చారు. తొలుత నదీజలాల సంగ్రహణం, మహాస్నపనం, లక్ష కుంకుమార్చన, మహాలక్ష్మీహోమం తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.



శుక్రవారం రాత్రి శ్రీవారి గరుడ వాహన సేవ

● శనివారం మహాపుష్పయోగం, సూర్య చంద్రప్రభ వాహన సేవ, సహస్రదీపాలంకరణ సేవ ఉంటాయి.

చిన్న పరిశ్రమలకు పెద్ద వేదిక

రూ.13 కోట్లతో పారిశ్రామిక సముదాయం

ఈనాడు, కాకినాడ: సూక్ష్మ- చిన్న- మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాల (ఎఫ్ఎఫ్‌సీ) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రానికి నాలుగు మంజూరు చేయగా అందులో ఒకటి కాకినాడ జిల్లాకు కేటాయించారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.13.30 కోట్లతో పెద్దాపురం పారిశ్రామిక వాడలో పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. 2.24 ఎకరాల్లో జీ ప్లస్2లో నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన శివరామ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. తొమ్మిది నెలల్లో పూర్తిచేయాల్సి ఉంది. కేంద్రం 70 శాతం నిధులు రూ.9.31 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు రూ.3.99 కోట్లు వెచ్చించి నిర్మించనున్న ఈ భవనంలో 26 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక యూనిట్లు (ఎంఎస్‌ఎంఈ)కు ప్లాట్లు అందుబాటులోకి వస్తాయి.

ఔత్సాహికులకు ప్రోత్సాహం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి.. తయారీ రంగానికి ఊతమివ్వాలనేది ఎఫ్ఎఫ్‌సీ ఉద్దేశం. గతంలో ఎంఎస్‌ఎంఈలకు స్థలాలు కేటాయిస్తే.. అక్కడ భవనాలు నిర్మించుకుని కార్యకలాపాలు సాగించేవారు. ఇందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే బహుళ అంతస్తుల భవనం నిర్మించి నేరుగా గదులు కేటాయించనుంది. భవిష్యత్తులో నేరుగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు దక్కనుందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి తెలిపారు.



పెద్దాపురంలో చేపట్టిన నిర్మాణ పనులు

సకల వసతులతో..

ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణానికి అనువైన స్థలం పెద్దాపురంలో ఉండడంతో జీప్లస్ 2 భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ 1,360 చ.మీలలో చేపడతారు. మిగిలిన ప్రాంగణాన్ని రోడ్లు, పార్కింగ్, పచ్చదనం, ప్రహరీ, విద్యుదీకరణ..భవిష్యత్తు విస్తరణ అవసరాలకు విడిచిపెట్టారు.

- గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏడు హాళ్లు ఉంటాయి. పరిపాలన విభాగం, బ్యాంకు, తపాలా కార్యాలయం, ముడి సరకు నిల్వ కేంద్రం, చికిత్సా కేంద్రం, క్యాంటీన్ వస్తాయి.
- మొదటి అంతస్థులో 9 హాళ్లు నిర్మిస్తారు. టెలీ కమ్యూనికేషన్ సెంటర్, కాన్ఫరెన్స్ హాలు, పోషణ కేంద్రం (క్రెచ్), సైబర్ సెంటర్ ఉంటాయి.
- రెండో అంతస్థులో..ప్రదర్శన శాల, క్లోరోఫ్లోరో కార్బన్స్ (సీఎఫ్‌సీ- 1, 2 క్యాబిన్లు ఉంటాయి.

ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

నేటినుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో క్షేత్రాల సందర్శన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహణలో ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం సరస్వతీఘాట్‌లోని పర్యాటకశాఖ కార్యాలయం నుంచి శనివారం ఉదయం 6 గంటలకు యాత్ర మొదలవుతుంది. తొలుత కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. అక్కడ్నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, ద్రాక్షారామ భీమేశ్వర స్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాల సందర్శన ఉంటుంది. అనంతరం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదారమ్మ నిత్యహారతి తిలకించడంతో ముగుస్తుంది. వాహనంలో 18 మంది భక్తులు ప్రయాణించవచ్చు. ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది.

టికెట్ ధర(రూ.లలో)
పెద్దలకు : 1000
పిల్లలకు(3 నుంచి 10ఏళ్ల లోపు) : 800
వివరాలకు నంబర్లు:
98486 29341
98488 83091



పిఠాపురంలోని పాదగయ క్షేత్రం

అదిగో పాపికొండల విహారం



దేవీపట్నం వద్ద పర్యాటకబోటుపై పరిశీలన

గోదావరి వరదల నేపథ్యంలో జులై 13 నుంచి నిలిచిపోయిన పాపికొండల విహార యాత్రకు తిరిగి శనివారం నుంచి శ్రీకారం చుట్టారు. గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ నుంచి దీనిని ప్రారంభిస్తున్నామని పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. గండిపోచమ్మ పాయింట్ నుంచి 40 మంది పర్యాటకులు, నలుగురు సిబ్బంది ప్రయాణించేందుకు వీలుగా కాటన్ పర్యాటక శాఖ బోటు, 14 ప్రైవేటు బోట్లు శనివారం నుంచి ఉంటాయి.

యాత్ర సాగేదిలా.. రాజమహేంద్రవరం ఏపీ పర్యాటక శాఖ కార్యాలయం నుంచి ఉదయం 7.30 గంటలకు వాహనంలో బయలుదేరి గండిపోచమ్మ బోటింగ్ పాయింట్‌కు చేరుకుంటారు. అక్కడ 9.30 గంటలకు యాత్ర మొదలై సాయంత్రం 5.30కు మళ్లీ అక్కడికే చేరుకుంటుంది. వాహనంలో బయలుదేరి సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం చేరుకోవడంతో ముగుస్తుంది.

టికెట్ రుసుము (రూ.లలో)
రాజమహేంద్రవరం నుంచి:
పెద్దలకు-1,250,
పిల్లలకు(పదేళ్లలోపు) : 1000
గండిపోచమ్మ బోటింగ్ నుంచి:
పెద్దలకు -1000,
పిల్లలకు(పదేళ్లలోపు)- 750
సంప్రదించాల్సిన ఫోన్ నం:
98486 29341

వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ

జేపీ వెంచర్స్ పేరితో రూ.వేల కోట్లు లూటీ: నిమ్మల

చాగల్లు, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. కొవ్వూరు మండలంలోని వాడపల్లి ఇసుక రీచ్‌ను ఆయన శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం జేపీ వెంచర్స్ పేరిట సుమారు రూ. 30 వేల కోట్ల నుంచి రూ. 40 వేల కోట్ల విలువైన ఇసుక లూటీకి పాల్పడిందన్నారు. దీంతో ప్రకృతి సంరక్షణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని రీచ్‌లను ప్రారంభించేందుకు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్, కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం సహజ సిద్ధంగా లభించే ఇసుక ఉచితంగా ప్రజలకు చేరాలనే ఆశయంతో ముందుకెళుతోందన్నారు. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ విధానంలోనూ సరఫరా చేసి డిమాండ్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వరద తగ్గుముఖం పట్టిన వెంటనే ఓపెన్ రీచ్‌లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో తవ్విన ఇసుకకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. రీచ్‌లపై పూర్తిసాయి అగ్రిమెంట్‌లు, హక్కులు ఇవ్వలేదని, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఇసుకను తీసుకు వెళ్లేవారిని అడ్డుకునే హక్కు ఎవ్వరికీ లేదని స్పష్టం చేశారు. ఇసుక రీచ్‌లలో పని చేసే కార్మికుల ఖాతాలకు వారం రోజుల్లో చెల్లింపులు జరిపేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్ రెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, తెదేపా పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ పాల్గొన్నారు.



వాడపల్లి ఇసుక ర్యాంపు నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి రామానాయుడు

సరఫరాపై సమీక్ష.. ధవళేశ్వరం: డిమాండ్‌కు అనుగుణంగా ప్రజలకు ఇసుక సరఫరా చేయడానికి ఉన్న అడ్డంకులపై స్థానిక కాటన్ అతిథి గృహంలో శుక్రవారం రాత్రి జిల్లాస్థాయి అధికారులు, నేతలతో ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సులువుగా ఇసుక లభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

28న సివిల్ సర్వీసెస్ క్రీడా జట్ల ఎంపిక

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం): రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 29, 30 తేదీల్లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడు డి.శేషగిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్‌ఫిజిక్ అంశాల్లో ఎంపికలు నిర్వహించనున్నామన్నారు. తమ పేర్లను ఈనెల 28వ తేదీ సాయంత్రంలోగా 90329 34038, 96405 03679 నంబర్లలో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

29 నుంచి నైపుణ్య గణన

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లా పరిధిలో ఈ నెల 29 నుంచి నైపుణ్య గణన సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు సర్వే కొనసాగుతుందన్నారు. దీనికి జిల్లా స్థాయి నోడల్ అధికారిగా తాను, మండలస్థాయి నోడల్ అధికారులుగా ఎంపీడీవోలు వ్యవహరిస్తారన్నారు. మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఈ నెల 29న మండలస్థాయి, నగర పాలక, మున్సిపల్ సిబ్బందికి నిర్వహించనున్నట్లు తెలిపారు.

800 చోట్ల పోషకాహార తోటలు

శ్యామలాసెంటర్: జిల్లాలో 800కు పైగా పాఠశాలల్లో పోషకాహార తోటలు(న్యూట్రీ గార్డెన్స్) ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు చెప్పారు. ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం డివిజన్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో డీఎస్ఈఓ మాట్లాడారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వి.ప్రసాద్ న్యూట్రీగార్డెన్ కార్యక్రమానికి పదివేల సీడ్ బాల్స్‌ను అందజేశారన్నారు. వాటిని శుక్రవారం డివిజన్ ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

పోలీసు అమరులారా.. వీరులారా..



రంగంపేట, న్యూస్‌టుడే: సమాజం కోసం పోలీసులు చేసిన ప్రాణత్యాగాలు మరువలేనివని తెలుపుతూ శుక్రవారం రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యతలు అందరినీ ఆకర్షించేలా ఈ సైకతాన్ని రూపొందించారు. పోలీసుల చేతుల్లో బాలలదేశం రక్షణతో ఉన్నట్లు దీన్ని చిత్రీకరించడంతో పలువురు వారిని అభినందించారు.

సైకతాన్ని రూపొందిస్తున్న దేవిన సోహిత, ధన్యత

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

దానవాయిపేట,(రాజమహేంద్రవరం): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ ఆధ్వర్యంలో డిప్లమా పారా మెడికల్ కోర్సుల (కన్వీనర్ కోటా) దరఖాస్తు గడువు నవంబరు మూడో తేదీ వరకూ పొడిగించినట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వర రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబరు 12వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారన్నారు. ఈ కోర్సులకు ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు 73373 62530, 79950 13422 నంబర్లనుగాని, బొల్లినేని మెడ్ స్కిల్స్ పారా మెడికల్ ఇనిస్టిట్యూషన్, రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రిలోగాని సంప్రదించాలని సూచించారు.

గుండె కోత మాపేలా..

ఎర్రకాలువ తాత్కాలిక పనులకు రూ.47.50 లక్షలు



నల్లజర్ల మండలం గుండేపల్లి వద్ద కోతకుగురైన ప్రమాదకరంగా..

ఈనాడు, రాజమహేంద్రవరం: భారీ వర్షం కురిస్తే చాలు ఎర్రకాలువ సమీప గ్రామాల్లోని మూడు నియోజకవర్గాల రైతులకు కంటిమీద కునుకు ఉండదు. గత కొన్నాళ్లుగా ఎర్రకాలువ విజృంభణతో వేలాది ఎకరాల పంటలు నష్టపోయారు. ఈ కాలువ జిల్లాలోని నల్లజర్ల, నిడదవోలు, దేవరపల్లి, చాగల్లు మండలాల్లో ప్రవాహం చూపిస్తుంది. మూడు నెలల క్రితం భారీ వర్షాలకు దాదాపు 10 వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఖరీఫ్ పంట పూర్తిగా దెబ్బతినడంతో 'ఈనాడు' వరుస కథనాలు వెలువరించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేక దృష్టి పెట్టి ఎర్రకాలువపై సమగ్ర సర్వే చేయించి అధికారులు గుర్తించారు. కాలువ పొడవునా దెబ్బతిన్న నిర్మాణాలు, కోతకు గురైన గట్లను గుర్తించి అధ్యయనం చేశారు. జల వనరుల శాఖ అధికారులు ఆయా గట్లను తాత్కాలికంగా మరమ్మతులు చేస్తే కొంతమేర సమస్య పరిష్కారమవుతుందని అంచనాలు రూపొందించారు. 11 పనులకు సుమారు రూ.60 లక్షలు అవసరమని ప్రతిపాదించారు. వీటిలో 8 పనులకు రూ.47.5 లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నిధులతో గట్లకు గండి పడిన ప్రాంతాల్లో ఇసుక బస్తాలు, వెదురు కర్రలతో బల్లలు ఏర్పాటు చేసి తాత్కాలిక రక్షణ కల్పిస్తారు.

చేపట్టనున్న చర్యలివే...

దేవరపల్లి మండలం త్యాజంపూడి వద్ద ఎడమ గట్టు (7.6 కి.మీ) పటిష్టతకు రూ.4.7 లక్షలు, 7.7 కి.మీ వద్ద రూ.5.7 లక్షలు, 8.25 కి.మీ వద్ద రూ.5.7 లక్షలు, 8.25 కి.మీ వద్ద రూ.5.5 లక్షలతో పనులు చేపడతారు.

● నల్లజర్ల మండలం గుండేపల్లిలో పలుచోట్ల ఎడమ కాలువకు గండ్లు పడ్డాయి. వీటిలో 1.95 కి.మీ వద్ద రూ.9 లక్షలు, 1.6 కి.మీ వద్ద రూ.5.6 లక్షలతో, 1.65 కి.మీ వద్ద రూ.5.6 లక్షలతో పనులు చేపడతారు. నిడదవోలు మండలం కంశాపాలెం (23.7 కి.మీ) వద్ద మరమ్మతులకు రూ.5.5 లక్షలు, 23.9 కి.మీ వద్ద పనులకు రూ.5.9 లక్షలు కేటాయించారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు పూర్తి

రాజానగరం: నన్నయ వర్సిటీలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలలో విజేతలను రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. ఈ పోటీలలో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని, జె.మాదిరాజులోని డీఆర్ రెడ్డి కళాశాల ద్వితీయ, పెనుగొండలోని ఎస్‌వీకేపీ కళాశాల తృతీయ, ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల నాల్గవ స్థానాలను సాధించాయన్నారు. ప్రతిభ కనబరిచిన 16 మంది వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈ జట్టు నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. నిర్వహణ కార్యదర్శి డా.ఎం.వి.ఎన్.ఎస్.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు, రైల్వేకోచ్ ప్రసాద్, బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు



డిస్క్ విసురుతున్న క్రీడాకారుడు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపికలు శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిశాయి. అండర్-17 విభాగంలో రెండోరోజు జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి పరుగు, జంప్స్, త్రో విభాగంలో ఎంపికలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను వచ్చే నెల 4 నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు కార్యదర్శి స్వామి పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ: కర్నూలు క్రీడలు: కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన దుర్గాప్రసాద్(హైజంప్) స్వర్ణ పతకం, బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పావని(పరుగు), చంద్రకళ(హైజంప్) రజత పతకాలు సాధించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

రాజానగరం, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్రప్రదేశ్ వారు ఈ నెల 27, 28 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్యసాయి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన గోడపత్రికను నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న విద్యార్థి సమ్మేళనంలో రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటారన్నారు. విశ్వవిద్యాలయాల ప్రాముఖ్యత, దాని చరిత్ర, విద్యార్థులకు దేశ నిర్మాణం, జాతీయ నూతన విద్యా విధానంపై అవగాహన వంటి అనేక రకాలైన కార్యక్రమాలు ఈ సమ్మేళనంలో నిర్వహించనున్నామన్నారు. ఏబీవీపీ విశ్వవిద్యాలయ శాఖ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి అభిషేక్, మహిళా కన్వీనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని కొట్టడంతో.. స్పృహతప్పిపడిపోయిన విద్యార్థిని

నిడదవోలు: మండలంలోని శెట్టిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏడో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయిని కర్రతో కొట్టడంతో ఒక విద్యార్థిని స్పృహతప్పి పడిపోయింది. విద్యార్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 7వ తరగతి గదిలో బ్యాగు జిప్ ఒక విద్యార్థిని జుట్టుకు పట్టుకోవడంతో తీసేందుకు మిగిలిన వారంతా ఆమె వద్దకు వచ్చారు. అదే సమయంలో కొందరు గట్టిగా అరవడంతో భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని సునీత పలువురు విద్యార్థులను కర్రతో కొట్టారు. దీంతో గిద్దా అఖిలాం దేశ్వరి అనే విద్యార్థిని స్పృహతప్పి పడిపోయింది. ఆమెను వైద్య సేవల నిమిత్తం నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థికి వాతలు కావడంతో పాటు జ్వరం రావడంతో తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని ఉపాధ్యాయులు పరామర్శించారు. ఘటనపై ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌ను వివరణ కోరగా తరగతి గదిలో అల్లరి చేస్తున్న పిల్లలను నిలువరించే క్రమంలో ఫిజిక్స్ ఉపాధ్యాయిని కొట్టారని, దీంతో విద్యార్థిని స్పృహతప్పి పడిపోయిందని, తల్లిదండ్రులతో మాట్లాడి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. చికిత్స అనంతరం ఆమెను ఇంటికి పంపించేశారు.

ఆశలు చిదిమేసిన మృత్యువు



నాగేశ్వరరావు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం నేరవార్తలు, రంగంపేట: ఆయనో సామాన్య రైతు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు వ్యాపారం చేసే కుటుంబ బాధ్యత [illegible] రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. [illegible] పోలీస్ స్టేషన్ పరిధిలో దివాన్‌చెరువు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రంగంపేట మండలం వెంకటాపురం [illegible] గ్రామానికి చెందిన [illegible] నాగేశ్వరరావు(42) వ్యవసాయం చేస్తుంటారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు. [illegible] రాజమహేంద్రవరం వచ్చి తిరిగి వెళ్తుండగా దివాన్‌చెరువు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ [illegible] ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. [illegible] కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి		11,500
కురిడీ (వెయ్యింటికి):		
పాతకాయ:	గండేరా	16,000
	గటగట	13,500
కొత్తకాయ:	గండేరా	15,500
	గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		12,000-13,500
కొత్త (పచ్చి) కాయ		11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		3,750
కిలో		260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00



రాజమహేంద్రవరం

ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలి

టి.నగర్: నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని నగర కమిషనర్ కేతన్ గర్గ్ సూచించారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాలపై కార్పొరేషన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులకు స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఆక్రమణలు తొలగించాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయం నుంచి పుష్కర ఘాట్ వరకు విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సినిమాలు దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, సూర్యప్యాలస్, స్వామి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్: **వెనమ్**, కుమారి, అప్సర: **దేవర**, అశోక: విశ్వం, సూర్యమినీ: **జనక అయితే గనక**, శివజ్యోతి: **పొట్టేల్**, ఊర్వశి: లగ్గం, మేనక: **నరుడి బ్రతుకు నటన**, రంభ: **సత్యం సుందరం**, ఎంత పని **చేశావ్ చంటి** (రెండేసి ఆటలు).

మంత్రిని కలిసిన ఎస్పీ

దానవాయిపేట: జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం విచ్చేసిన రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును జిల్లా ఎస్పీ డి.నరసింహాకిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పోటాపోటీగా పోలీస్ క్రీడలు



400 రిలే పోటీలో పాల్గొన్న పోలీసులు



200 మీటర్ల పరుగులో మహిళలు

దానవాయిపేట, న్యూస్‌టుడే: నిత్యం ఫిర్యాదు.. ప్రమాదాలు.. కేసులు.. కోర్టు వాయిదాలతో క్షణం తీరిక లేక బిజీగా గడిపే పోలీసులు గత రెండు రోజులుగా ఆటలను ఆస్వాదిస్తున్నారు. జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్-2024 రెండో రోజు శుక్రవారమూ ఉత్సాహంగా సాగింది. జిల్లాలోని మొత్తం ఏడు జోన్ల సిబ్బంది పరుగు, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, షటిల్, స్విమింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది కొత్తగా స్విమ్మింగ్ పోటీలు కూడా నిర్వహించారు. క్రీడా పోటీలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానం.. జాంపేట ఏఆర్ గ్రౌండ్స్, నగరపాలక సంస్థ ఈతకొలను వేదికలయ్యాయి.



ఈత పోటీల్లో కానిస్టేబుళ్లు

మొదటి ముగ్గురు విజేతలు వీరే..

మహిళా విభాగం

200 మీటర్ల పరుగు: ఆర్.రోహిణ(సెంట్రల్ జోన్), కె.కన్న(సెంట్రల్ జోన్), కె.రోజా(సౌత్ జోన్)

400 మీటర్ల పరుగు: ఆర్.రోహిణ(సెంట్రల్ జోన్), కె.భవానీ(సెంట్రల్ జోన్), ఎం.జ్యోతి(ఏఆర్)

800 మీటర్ల పరుగు: కె.భవానీ(సెంట్రల్), ఎం.జ్యోతి(ఏఆర్), కె.రోజా(సెంట్రల్ జోన్)



పురుషుల విభాగంలో..

200 మీటర్ల పరుగు: పి.బాపన్నదొర(ఏఆర్), టి.అనిల్‌కుమార్(ట్రాఫిక్), జి.సురేష్(ఏఆర్).

400 మీటర్ల పరుగు: పి.బాపన్నదొర(ఏఆర్), కేఎన్‌వీ రత్నం(ఏఆర్), పి.సతీష్ కుమార్(సౌత్).

800 మీటర్ల పరుగు: ఎస్ఆర్‌డీవీ ప్రసాద్(నార్త్), కె.కమలేశ్వర్(ఏఆర్), ఎం.శంకర్(ఏఆర్)

స్విమ్మింగ్: ఎం.రాజేష్, కె.చిన్నరావు, బి.రాజాబాబు

- వాలీబాల్‌లో ఏఆర్-సౌత్ జోన్లు, కబడ్డీలో సెంట్రల్-ఏఆర్ జోన్లు, క్రికెట్‌లో ఏఆర్-ట్రాఫిక్ జోన్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.



కొవ్వూరు-నార్త్‌జోన్ జట్ల మధ్య వాలీబాల్ పోటీ



హైజంప్ విభాగంలో..

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్పీఎఫ్ ప్రతిభ

దానవాయిపేట(రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్) 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20 నుంచి 23 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం ఎస్పీఎఫ్ జోన్ పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిందని దళం కమాండెంట్ కొండా నరసింహారావు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం కార్యాలయంలో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పీవీఎస్ఏడీ ప్రసాద్‌రావు, బి.శ్రీనివాసరావు, ఒ.కృష్ణయ్య, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన ఎస్పీఎఫ్ సిబ్బందితో కమాండెంట్

ఉద్యోగ మేళాకు వెళ్దాం పదండి..

ఆర్ట్స్ కళాశాలలో నేడు 50కి పైగా కంపెనీల రాక

న్యూస్‌టుడే, టి.నగర్ (రాజమహేంద్రవరం)

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఉద్యోగ మేళా జరగనుంది. ఇందులో 50కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇందులో 20కి పైగా సాఫ్ట్‌వేర్‌తోపాటు కార్పొరేటు కంపెనీలు భాగస్వామ్యమవుతున్నాయి.

ఎన్నికల హామీలో భాగంగా నగర ఎమ్మెల్యే శ్రీనివాస్ నేతృత్వంలో ఈ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క రోజులో కనీసం వెయ్యి, 1500 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రణాళికతో మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మేళా ప్రారంభం కానుంది. జిల్లాతోపాటు హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ప్రతినిధులు తెలిపారు.

ఇవీ విద్యార్హతలు

పదో తరగతి మొదలు కొని ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తిచేసిన అభ్యర్థులు హాజరుకావచ్చు. ఆయా విభాగాల్లో 4,210 మంది ఆన్‌లైన్‌లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు

మేళాకు సంబంధించి వచ్చే అభ్యర్థుల కోసం తగిన ఏర్పాట్లు చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుద్ధ భవన్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఏ కంపెనీ ఎక్కడ ఎంపికలు నిర్వహిస్తారనేది ముందుగానే కళాశాల వద్ద వివరాలు ప్రచురించారు. కళాశాల ఆవరణలో తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

కుంగింది.. కాస్త చూడరూ..

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: దేవీచౌక్ నుంచి పేపరు మిల్లు రోడ్డులో రామచంద్రరావుపేట వద్ద పరిస్థితి ఇది. పెద్ద కాలువ వద్ద పైపు లైను పనులు నేపథ్యంలో రోడ్డు అంచు కుంగి ప్రమాదకరంగా మారింది. నిత్యం పాదచారులు, వాహన చోదకులతో రద్దీగా ఉండే ప్రధాన మార్గం కావడంతో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని, అంతవరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



'పదేపదే విమర్శలు తగవు'

దేవీచౌక్, న్యూస్‌టుడే: అయిదేళ్లు ఎంపీగా పనిచేసిన భరత్‌రామ్ రాజకీయ అజ్ఞానంతో మాట్లాడుతున్నారని తెదేపా నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ధ్వజమెత్తారు. కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులపై పదే పదే విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో రెడ్డి మణి మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మించి లైట్లు వేయకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. త్వరలో లైట్లు, సర్వీసు రోడ్డు అన్నీ వస్తాయన్నారు. ఫ్లై ఓవర్ గుత్తేదారు మాజీ ఎంపీ స్థలంలో పెట్టుకున్న సామగ్రి తీయనీయకుండా తాళాలు వేసి తన స్థలంలో రోడ్డు వేయాలంటూ డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత గాథలు తెలుసుకోవాలి

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: మహనీయుల జీవిత గాథలు, మన దేశ చరిత్రను నేటి విద్యార్థులు తెలుసుకోవాలని ప్రతిభ ఎడ్యుకేర్ పాఠశాల ఇంఛార్జి పి.సత్యనారాయణ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో శుక్రవారం జరిగిన వ్యాసరచన పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో పదో తరగతి విద్యార్థిని బి.నిషిత వైష్ణవి, 9వ తరగతి విద్యార్థి కె.జెస్సీ ఆనంద్, 8వ తరగతి విద్యార్థి ఎం.జాన్ లాజరస్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఇంఛార్జి పి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ జె.వెంకటేశ్వరరావు విజేతలకు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎస్.ప్రత్యూష, పి.సౌమ్య వ్యవహరించారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు



వ్యాసరచన పోటీల్లో ప్రతిభ ఎడ్యుకేర్ పాఠశాల విద్యార్థులు

క్రమశిక్షణతో ఉజ్వల భవితకు బాటలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ భవితకు బాటలు వేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ రాజమండ్రి వజ్రం, లయన్స్ క్లబ్ రాజమండ్రి కడియం హార్టికల్చర్ సహకారంతో ఆనం కళా కేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించిన దిక్సూచి కార్యక్రమం శుక్రవారం ముగిసింది. నిపుణులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదని, ఉత్తమంగా ఎదగడంలో వారి కృషి దాగి ఉంటుందని లయన్ వజ్రపు కోటేశ్వరరావు చెప్పారు.

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణు భగవాన్ నాయకత్వ లక్షణాలను వివరించారు. సంపద సృష్టించాలి.. నేర్చుకున్న దానిని నీతోపాటు కుటుంబం, సమాజానికి ఉపయోగపడేలా వినియోగించాలన్నారు.
- యువత అనవసర విషయాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను మంచి కోసం వినియోగించాలని రామ్ జలదుర్గం సూచించారు.
- శ్రీనివాస్ సోను మాట్లాడుతూ మనిషి ఉన్నతంగా ఎదగాలంటే విద్య చాలా అవసరమన్నారు. ఎందులో ఆసక్తి ఉందో తెలుసుకుని కృషి చేస్తే విజయం వెన్నంటే ఉంటుందన్నారు.
- సతీష్ తూము మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల యువతకు అవగాహన ఉండాలన్నారు. బెట్టింగులు, లోన్ యాప్‌లు, క్రెడిట్ కార్డుల్లో జరిగే మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణు భగవాన్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం నేరవార్తలు: నగరంలోని తాడితోట సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లుగా ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన ఈ వ్యక్తి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: పట్టపగలే చోరీ ఘటన మూడో పట్టణ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వి.అప్పారావు వివరాల మేరకు.. పేపరు మిల్లు ఉద్యోగి పలివెల సుదర్శన్‌కుమార్ లూథరగిరి చర్చి కాంపౌండ్‌లోని ఓ ఇంట్లో నివాసముంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం విధుల నుంచి వచ్చేసరికి ఇంటి తాళం తెరిచి ఉంది. లోపల బీరువాలో 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదని పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జరిమానా

దానవాయిపేట: జిల్లాలో గత రెండు రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 13 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు.

ఉద్యమంలా సభ్యత్వ కార్యక్రమం

టి.నగర్, న్యూస్‌టుడే: నగరంలో తెదేపా సభ్యత్వ నమోదు ఉద్యమంలా చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హోటల్ జగదీశ్వరిలో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని, నమోదులో రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ సభ్యత్వం వల్ల రూ.5 లక్షల బీమా లభిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జగన్ వ్యవస్థలన్నింటిని నాశనం చేశారన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

టి.నగర్, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఈ మేరకు ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన ఎన్నికల సమాయత్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అఖండ విజయాన్ని అందించాలన్నారు. నవంబరు 6వ తేదీ వరకూ ఓటు నమోదు ప్రక్రియ జరుగుతుందని, కార్యకర్తలే పార్టీ విజయానికి మూల స్తంభాలన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: తిలక్ రోడ్డు సాయిబాబా ఆలయం సమీపంలోని ఎస్‌బీఐ ఎదుటి వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. – సత్యమూర్తి

సమస్య: లలితానగర్ మొదటి వీధిలో నెల రోజులుగా వీధిదీపాలు వెలగడంలేదు. – ఎస్.జాను

సమాధానం: వీధి దీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – దేవీభ్రమరాంబిక, ఎలక్ట్రికల్ ఏఈ

సమస్య: రెహమత్‌నగర్‌లో పందుల బెడద ఎక్కువగా ఉంది. నివాసాల చెంత స్వైరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. – మాలిక్

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – వినూత్న, ఎంహెచ్‌వో

స్పందనకు వందనం

- ఆల్‌బ్యాంకు కాలనీ వెనుక వెంకటరామరాజునగర్‌లో పగిలిన తాగునీటి పైపులైనుకు సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టినట్లు ఫిర్యాదుదారుడు పాపారావు తెలిపారు.
- లక్ష్మీవారపుపేట ఎలుకలవారివీధిలో చెత్తను తొలగించి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు సూర్యచంద్రరావు తెలిపారు. –న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు

83282 39927
80089 02897

28 నుంచి వారోత్సవాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం తపాలా డివిజన్ పరిధిలో ఈ నెల 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు తపాలా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ కె.శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నవంబరు ఒకటో తేదీన డాక్ అదాలత్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

తపాల ఉద్యోగుల నిరసన

దేవీచౌక్, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు శుక్రవారం డివిజన్‌లోని పలు కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. రాజమహేంద్రవరం తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు మాట్లాడుతూ దశలవారీ ఉద్యమంలో భాగంగా నవంబరు 12, 13 తేదీల్లో దిల్లీలోని డాక్ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

అన్నసమారాధన

వి.ఎల్.పురం: నగర పరిధిలోని 10వ డివిజన్ మోరంపూడి సాయిచైతన్యనగర్‌లోని శ్రీవిజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన జరిగింది. శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైకాపా నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, షర్మిలారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, అన్నసమారాధనను ప్రారంభించారు.

నిధుల కేటాయింపుపై హర్షం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అమరావతి రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల రామకృష్ణారావు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని ఈ నిర్ణయం ద్వారా రుజువైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డబుల్ ఇంజన్ సర్కారు ద్వారా రాష్ట్రాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఇచ్చిన వాగ్దానానికి అనుగుణంగా అమరావతి, పోలవరం నిర్మాణానికి, గ్రామాల అభివృద్ధికి, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం భారీగా నిధులు కేటాయించిందన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

దేవీచౌక్: విద్యార్థులు కేవలం వీడియోలను ఉపయోగించడమే కాకుండా.. వాటిని తయారు చేసే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'విజన్ టూ వీడియో, స్టూడియో వీడియో ప్రొడక్షన్' అనే అంశంపై శుక్రవారం కార్యశాల నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వీడియో తయారీ విద్యార్థుల్లో ఆలోచన, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంచి వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ఈ-పాఠ్యాంశాల తయారీ నైపుణ్యాల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అతిథి ఉపన్యాసం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అతిథి ఉపన్యాసం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.భారతి సీజనల్ వ్యాధుల గురించి వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులపై పెరిగిన పనిభారం

వి.ఎల్.పురం: పారిశుద్ధ్య కార్మికులపై పనిభారం పెరిగిందని, సిబ్బంది శ్రమదోపిడీకి గురవుతున్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా మహాసభ శుక్రవారం జరిగింది. రెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బారాయుడు మాట్లాడుతూ గడిచిన 14 ఏళ్లలో జనాభా పెరిగిందని, అన్నిచోట్లా టన్నులకొద్దీ వ్యర్థాలు వస్తున్నా వాటి తొలగింపునకు అవసరమైన పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడా లేరన్నారు. తక్షణం పారిశుద్ధ్య కార్మికుల నియామకం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.మధు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీపీఐ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సభకు ప్రదర్శనగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని భారతీయ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీయజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద పేర్కొన్నారు. కోటిలింగేశ్వర స్వామివారి కల్యాణ మండపంలో భారతీయ ధర్మ పరిషత్ సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో శ్రీకృష్ణ చరణానంద ప్రసంగిస్తూ దేశమంతా తిరిగి సనాతన ధర్మ ప్రచారంతో పాటు విజ్ఞాన చైతన్యం కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మచారిణి విరజా చైతన్య పేరవరం గీతాశ్రమ అధిపతి సత్యానంద గిరిస్వామి, పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు, సమరత సేవా సమితి జిల్లా నాయకుడు కర్రి శ్రీనివాస్, భాజపా ధార్మిక సెల్ కన్వీనర్ చాగంటి నరసింహారావు, లీగల్ సెల్ వేగి భద్రం తదితరులు పాల్గొన్నారు. భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుగా రాజనాల రామచంద్ర, ఏపీ జనరల్ సెక్రటరీగా వీరశంకర్, ఉపాధ్యక్షులుగా డి.వీరబాబు నియమితులయ్యారని నిర్వాహకులు తెలిపారు.



ప్రసంగిస్తున్న రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

గోపాలపురం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విద్యాపతి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. గోనె సంచులు కొరత, మిల్లుల నుంచి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

రూ.43 లక్షలతో రోడ్ల మరమ్మతులకు ఆమోదం

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు నియోజకవర్గ పరిధిలో పలు ర.భ.శాఖ రహదారుల మరమ్మతులకు రూ.43 లక్షల పరిపాలనామోదం లభించినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం, పసలపూడి మీదుగా దువ్వ, తేతలి, మునిపల్లి రోడ్డులో 7.20 కిమీ నుంచి 8.248 కిమీల మధ్య గుంతలు పూడ్చి, మరమ్మతులు చేసేందుకు రూ.10 లక్షలు, 142/4 నంబర్ 5 రహదారి నుంచి ఖండవల్లి వరకు 1.4 కిమీ నుంచి 3.05 కిమీ వరకు ఇంటర్మిట్ ప్యాచ్‌వర్కులకు రూ.15 లక్షలు, కానూరు-గోవవరం రహదారిలో 5.6 కిమీ నుంచి 8 కిమీల వరకు మరమ్మతు పనుల నిమిత్తం రూ.18 లక్షలు మంజూరయ్యాయన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు



విజేతలతో ఉపాధ్యాయుడు రమణ

చాగల్లు, న్యూస్‌టుడే: పోటీతత్వంతోనే ప్రగతి సాధ్యమని కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్యామ్‌సన్ తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంపై లాభాలు, నష్టాలు' 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్.ఆరాధన(10వ తరగతి). టి.ధన సుబ్బలక్ష్మి (8వ తరగతి), జి.శివచరణ్ (9వ తరగతి) నిలిచారు. వారికి ఉపాధ్యాయుడు పి.వి.రమణ 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు

• భూముల రీసర్వేలో చిత్రవిచిత్రాలు • గ్రామసభలకు వెల్లువెత్తుతున్న అర్జీలు


తాళ్లపూడి, న్యూస్‌టుడే: ఉన్న భూమి లేనట్లు.. లేని భూమి ఉన్నట్లు.. కొలతల్లో హెచ్చుతగ్గులు.. సరిహద్దుల్లో మార్పులు.. వైకాపా పాలనలో చేపట్టిన భూముల రీసర్వేలో ఇటువంటి చిత్రవిచిత్రాలెన్నో చోటు చేసుకున్నాయి. ఇవన్నీ ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల సందర్భంగా వెలుగు చూస్తున్నాయి. రైతుల నుంచి వినతులు వెల్లువెత్తున్నాయి. కూటమి ప్రభుత్వం హయాంలో తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో రైతులు దరఖాస్తు అందించేందుకు గ్రామసభలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

గత వైకాపా హయాంలో చేపట్టిన భూముల రీసర్వేకి సంబంధించి అప్పట్లో రైతులకు సరైన సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవు. వారి అభ్యంతరాలను సైతం పట్టించుకోకుండా ఇష్టానుసారం కార్యక్రమం పూర్తి చేశారు. ఈ కారణంగా కుప్పతెప్పలుగా తప్పులు దొర్లాయి. వాటి పరిష్కారానికి అప్పట్లో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోయింది. ఒక సర్వే నంబరులో ఎంతమంది రైతులకు భూములున్నా.. విభజన చేయకుండా ఉమ్మడిగా చూపించారు. దీంతో వ్యక్తిగత అడంగల్, 1బీ రాక. రాయితీ పథకాలు, పంట రుణాలు అందని పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో వివరాలు మాత్రం మారడం లేదు. దీంతో క్రయవిక్రయాలకు అవకాశం లేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ రీసర్వే కారణంగా సోదరుల మధ్య, రైతుల మధ్య తగాదా రేగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 17 నుంచి 93 రెవెన్యూ గ్రామాల్లో ఈ సభలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన గ్రామసభల్లో పలు నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. శుక్రవారం తాళ్లపూడి మండలం రాఘవాపురంలో పలువురు రైతులు అభ్యంతరాలను తెలుపుతూ 67 దరఖాస్తులను అందజేశారు. వీటిని పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



తాళ్లపూడి గ్రామసభలో అర్జీలు అందిస్తున్న రైతులు

పది సెంట్లు తగ్గిపోయింది..



తాత ముత్తాల నుంచి వచ్చిన భూమిని నలుగురు అన్నదమ్ములు పంచుకున్నాం. రీసర్వేలో వేర్వేరు ఖాతాల్లో ఉన్న 0.43, 0.61 సెంట్ల భూమిని 0.94 సెంట్లుగా చూపించారు. గతంలో పది సెంట్లు తగ్గించారు. ప్రస్తుతం రీసర్వేలో మరో పది సెంట్లు తగ్గించి పాసుపుస్తకం ఇచ్చారు. మరో చోట 0.56 సెంట్లు భూమికిగాను 0.54 సెంట్లుగా చూపించారు. బ్యాంకు రుణం కోసం బ్యాంకు వెళ్లితే ఇబ్బందులు తప్పడం లేదు.

- రేకపల్లి వెంకటేశ్వరరావు, రైతు

ఏడాది నుంచి తిరుగుతున్నా..



రీసర్వేలో వచ్చిన తప్పులను సరి చేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఏడాది నుంచి తిరుగుతున్నా. డ్రోన్ ద్వారా రీసర్వే చేశారు. 0.70 సెంట్లు ఉన్న భూమిని 0.67 సెంట్లుగా నమోదు చేశారు. దానిని ఇప్పటికీ సరి చేయలేదు.

- పుప్పాల నాగరాజు, రైతు

మరొకరికి కలిపేశారు..



రీ సర్వేలో ఒక చోట 0.47 సెంట్ల భూమిని 0.43గా నమోదు చేశారు. మరో చోట 0.97 సెంట్లు భూమిని 0.93 సెంట్లుగా తగ్గించి చూపించారు. రెండు చోట్ల కొంత భూమిని పక్కనున్న రైతులకు కలిపేశారు. అన్ని రికార్డులు ఉన్నా పట్టించుకోలేదు.

- వీరా రామకృష్ణ, రైతు

తెదేపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

నిడదవోలు: ఈనెల 26 నుంచి ప్రారంభ కానున్న తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కొమ్మిన అధ్యక్షతన శుక్రవారం వార్డు ఇన్‌ఛార్జులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదుపై చర్చించారు. పట్టణ కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, పంచదార దుర్గాప్రసాద్, నాయకులు బైపే రెడ్డేశ్వరరావు, ఎండీ పాషా, వేదర్ల రాజు, గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

నిడదవోలు, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. శుక్రవారం నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎం మహాలక్ష్మి ఆధ్వర్యంలో సీసీలు, వీవోఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ఉద్యమ పథకాల అభివృద్ధి బ్యాంకు ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం హేమంత్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అనేక పథకాల అమలు..

చాగల్లు: మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చిన్న తరహా పరిశ్రమల జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. చాగల్లు మండల సమైక్య భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొళాయి కనెక్షన్లు నిలుపుదల

నిడదవోలు: నిడదవోలులోని విద్యానగర్, బాలాజీనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఇంటి, కొళాయి పన్ను అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారి కొళాయి కనెక్షన్లు శుక్రవారం పురపాలక అధికారులు తొలగించారు. కమిషనర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. చెల్లించని వారిపై పురపాలక సంఘ చట్టం 1965 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై చర్చించారు. కూటమి నాయకులు అల్లూరి విక్రమాదిత్య, సూరపనేని చిన్ని, పెద్దపాటి కృష్ణమోహన్, కె.సన్యాసినాయుడు, ఎంపీడీవో రమణ పాల్గొన్నారు.

పశుగణనతో పాడిపరిశ్రమ రంగం అభివృద్ధి

చాగల్లు: పశు గణన చేపట్టడం వల్ల భవిష్యత్తు ప్రణాళిక, విధాన రూపకల్పన జరిగి పాడిపరిశ్రమ రంగం అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత పశుగణన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పశుసంవర్ధక శాఖ కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకులు ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ● చాగల్లు మండలంలో శుక్రవారం నుంచి పశుగణన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ ఎంపీపీ ఎం.వెంకట్రావు, నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కోడూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ఘన స్వాగతం

చాగల్లు, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన తర్వాత మంత్రి నిమ్మల రామానాయుడు మొదటిసారిగా శుక్రవారం కొవ్వూరు విచ్చేశారు. ఆయనకు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు నాయకులు దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను అనుసరిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ ఆశయాలను అమలు పరిచేలా కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి టి.వి.రామారావు, తదితరులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



మంత్రి రామానాయుడికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నాయకులు

మహిళల ఆర్థికాభ్యున్నతితో దేశాభివృద్ధి

నిడదవోలు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. నిడదవోలు పట్టణంలోని సంతమార్కెట్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ప్రారంభించారు. దీనిని పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణతో కలిసి ఆమె తిలకించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వెంకటలక్ష్మి, సింధు మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ తదితరులు

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

నిడదవోలు, న్యూస్‌టుడే: రానున్న దీపావళి దృష్ట్యా బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం వివిధ శాఖల అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పట్టణంలో దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్, అగ్నిమాపకాధికారి సుబ్బారావు, పట్టణ ప్రణాళికాధికారి సుప్రియ పాల్గొన్నారు.

అవీ ఇవీ అన్నీ

● వైకాపాకు గంగుల రాజీనామా

నిడదవోలు : వైకాపా జిల్లా బీసీ సెల్ కార్యదర్శి గంగుల గోపాలకృష్ణ(గోపి యాదవ్) పదవికి, పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు రాజీనామా పత్రాన్ని పంపించారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు వ్యవహారశైలి నచ్చక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు వైకాపాలో గుర్తింపు లేదన్నారు.

● సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

గోపాలపురం : స్థానిక ఉన్నత పాఠశాల ఎదురుగా రూ. 15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణంశుక్రవారం ప్రారంభించారు.

● సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

గోపాలపురం : గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందట చేపట్టిన పనులకు సంబంధించి శనివారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణంలో ఉదయం 10 జరిగే కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలన్నారు.

● పూర్వ విద్యార్థుల ఔదార్యం

తాళ్లపూడి : వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల 1984-86 సంవత్సరం పూర్వ విద్యార్థులు రూ.70 వేలు విలువైన రెండు కంప్యూటర్లను శుక్రవారం అందజేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసు, రఘువీరశాస్త్రి, కె.వెంకన్నబాబు, వీరశంకరం, జె.రామకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

● మొక్కు చెల్లించుకున్న తెదేపా కార్యకర్తలు

నల్లజర్ల : ఆవపాడుకు చెందిన తెదేపా కార్యకర్తలు సింగం రాజేష్, శ్రీకాకోల్ శ్యామ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, మద్దిపాటి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని గతంలో గుణదల మేరి మాతకు మొక్కుకున్నారు. అవి నెరవేరడంతో శుక్రవారం మొక్కు చెల్లించుకున్నారు.

● ఆర్థిక సాయం అందజేత

దేవరపల్లి : మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న దుద్దుకూరుకు చెందిన పరిటాల శేఖర్ కుమారుడు కృష్ణసతీష్‌కు జనసేన గ్రామపార్టీ అధ్యక్షుడు సంబా బాలశ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, కాట్నం గణేష్, గంగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

● విద్యార్థినికి అభినందన

నల్లజర్ల : ఇటీవల తాడేపల్లిగూడెంలోని బుద్దాల కళా వేదికలో 24 గంటలపాటు కూచిపూడి నృత్యం ప్రదర్శించి అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సాధించిన బృందంలో ఒకరైన ముదునూరి వర్షిణి సాయి ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. ఆమెను ప్రిన్సిపల్ అరవింద్‌కుమార్, యాజమాన్యం, సిబ్బంది శుక్రవారం అభినందించారు.

● సహ చట్టంపై అవగాహన అవసరం

ఉండ్రాజవరం : సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. వ్యవసాయశాఖ అధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పి.ప్రసాద్, ఏవోవిశ్వాసరావు తదతరులు పాల్గొన్నారు.

● భూమి కొలతల పరిశీలనకు వినతి

తాళ్లపూడి : మండలంలోని రావూరుపాడులో రీసర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. భూమి కొలతల పరిశీలన నిమిత్తం 67 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు రవీంద్రనాథ్ తెలిపారు. డీటీ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

● రైతుల సందేహాల నివృత్తి..

ఉండ్రాజవరం : పాలంగిలో భూ సమస్యలపై పలువురు రైతులు అర్జీలు అందజేశారు. వారి సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. రీసర్వే డీటీ హరిప్రసాద్, సర్పంచి బొక్కా శ్రీనివాసు, సర్వేయరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఏకరూపదుస్తులు అందజేత

ఉండ్రాజవరం : ఉండ్రాజవరంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు తణుకుకు చెందిన సామాజికవేత్త, దాత చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో ఏకరూపదుస్తులు అందించారు. పేద విద్యార్థినులకు పరీక్ష ఫీజు చెల్లించారు. హెచ్‌ఎం మాణిక్యాలరావు, అధ్యాపకురాలు బూరుగుపల్లి పద్మజారాణి పాల్గొన్నారు.

● అన్నసమారాధన

దేవరపల్లి : స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లో సౌభాగ్య దుర్గాంబిక ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 7,500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● నేటి నుంచి బస్సుల దారి మళ్లింపు

నిడదవోలు : కవిటం నుంచి మార్టేరు, పెనుగొండ నుంచి పెరవలి వరకు రహదారి మరమ్మతుల కారణంగా ఈనెల 26 నుంచి నిడదవోలు డిపో బస్సులను దారి మళ్లించి తిప్పుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. నిడదవోలు నుంచి నరసాపురం వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు వంతెన, ఆలమూరు, మార్టేరు, పెనుగొండ, వడలి, సిద్ధాంతం, ఖండవల్లి, పెరవలి మీదుగా నడపనున్నట్లు తెలిపారు.

● ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఉండ్రాజవరం : చివటం, సూర్యారావుపాలెం, సత్యవాడలో పారిశుద్ధ్య పనులను మండల శానిటేషన్ కోఆర్డినేటర్‌ప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు.

● ఓపెన్ స్కూల్ సందర్శన


చాగల్లు : స్థానిక ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు జి.గోపికృష్ణ గురువారం సందర్శించారు. విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

నిడదవోలు సీఐగా గంగాధర తిలక్



నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు సీఐగా పి.వీర గంగాధర తిలక్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం స్పెషల్ బ్రాంచి నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు బాపూజీ మృతి



చాగల్లు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ గంధం పూజ్య నరసింహా బాపూజీ శుక్రవారం మృతి చెందారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన ఆత్మ శాంతించాలని పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్..

పెనుగొండ: విధుల్లో ఉండగానే గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి చెందిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం వడలిలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కొవ్వూరు డిపో బస్సు భీమవరం నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా వడలిలోని శ్రీనివాస సర్వీసింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి కండక్టర్ కె.ఎస్.నారాయణకు గుండెపోటు వచ్చింది. బస్సులోనే కుప్ప కూలి మృతి చెందారు. ప్రస్తుతం నారాయణ కొవ్వూరులో నివాసం ఉంటున్నట్లు సమాచారం.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఉండ్రాజవరం : ఉండ్రాజవరానికి చెందిన పాతికేళ్ల వివాహిత అశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 23న తణుకులోని అమ్మమ్మ ఇంటికి బయలుదేరి వెళ్లిన ఆమె తిరిగి రాలేదని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదుపుతప్పి కాలువలో బోల్తా




ట్రక్ ఆటోను బయటకు తీస్తున్న స్థానికులు

తాళ్లపూడి, న్యూస్‌టుడే : మండలంలోని అన్నదేవరపేట నుంచి వెంకటాయపాలెం వెళ్లే రహదారిలో కొవ్వాడ వరదనీరు ప్రవహించే కల్వర్టుపై నాచు కట్టడంతో శుక్రవారం అటుగా పాల కేన్లతో వెళుతున్న ట్రక్ఆటో అదుపు తప్పి కాలువలో పడిపోయింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు అక్కడకు చేరుకుని ట్రాక్టర్ సాయంతో ట్రక్ఆటోను బయటకు తీశారు. నాచు పేరుకుపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరారు.

పల్లంట్ల యువకుడికి రూ.లక్ష రివార్డు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం పల్లంట్లకు చెందిన బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు మోహర్‌శ్రీ రామకృష్ణ మహంత్ కేరళ రాష్ట్రం కాలికట్ ప్రాంతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బీఆర్క్ ఆర్కిటెక్చర్ విభాగంలో మొదటి స్థానం సాధించాడు. దీంతో కళాశాల యాజమాన్యం మెరిట్ అవార్డుగా రూ.లక్ష చెక్కు శుక్రవారం ఆయనకు అందజేసింది. ఆ మొత్తాన్ని దేవరపల్లి మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు అందజేసి సేవాకార్యక్రమాలకు ఉపయోగిస్తామని మహంత్ చరవాణిలో 'న్యూస్‌టుడే'కి తెలిపారు. దీంతో ఆయనను తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న పల్లంట్ల యువకుడు

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

గోపాలపురం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆ శాఖ ఎస్ఈ బి.వి.వి.గిరి సూచించారు. మండలంలోని పెద్దగూడెంలో తాగునీటి సరఫరాను ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పైపులైన్లు, ట్యాంకులను పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు 16 వార్డు వాసులు ఆయనకు వివరించారు. సమస్య పరిష్కరిస్తామని, అవసరమైతే అదనంగా బోరు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒక ప్రాంతంలో నీటిని సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఏఈ బంగారయ్య, పంచాయతీ కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలన కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నిడదవోలు, న్యూస్‌టుడే: మండలంలోని తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి అండర్-17 విభాగంలో టి.దివ్యశ్రీ, కె.దివ్యహర్షిని, ఎన్.శ్యామలదుర్గ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణశాస్త్రి, వ్యాయామోపాధ్యాయుడు బండి ప్రదీప్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పలువురు అభినందించారు.

నల్లజర్ల: నల్లజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కోమలిచిత్ర పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి ఖోఖో జూనియర్స్ విభాగంలో మైనం దుర్గాభవానీ(9వ తరగతి) ఈ నెల 20న ఏలూరు జిల్లా బొర్రంపాలెం ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికై 27న చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే పోటీలో పాల్గొంటుందన్నారు. చిలక హర్షవర్ధన్(9వ తరగతి) కబడ్డీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై వచ్చేనెల 9, 10, 11 తేదీల్లో బాపట్ల జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా వారిని శుక్రవారం విద్యా కమిటీ ఛైర్మన్ కోడూరి నారాయణ, వ్యాయామోపాధ్యాయురాలు స్వాతి, సిబ్బంది అభినందించారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

జాబ్‌మేళాతో 17మందికి ఉపాధి

ధవళేశ్వరం(కడియం): ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి సంస్థ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు జాబ్‌మేళాను నిర్వహించారు. బొమ్మూరు ఐటీఐ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన మేళాలో ముగ్గురు పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొని హాజరైన 59మంది నిరుద్యోగుల నుంచి 17 మందిని ఎంపిక చేశారు. జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి అధికారి హరిశ్చంద్రప్రసాద్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణన్‌తో పాటు ముఖ్యఅతిథులుగా జిల్లా ఎంప్లాయిమెంట్ స్కిల్ హబ్ సమన్వయకర్త గండి సురేశ్, జిల్లా నియామక అధికారిణి డి.పావని ప్రియ పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న రైతు ప్రసాద్

రంగంపేట: విత్తనశుద్ధి చేసే విధానం, దానివల్ల కలిగే ప్రయోజనాలపై వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. శిక్షణ నిమిత్తం రంగంపేటలో ఉన్న విద్యార్థులు విత్తనశుద్ధిని రైతుల సూచనల మేరకు చేశారు. విత్తనశుద్ధి చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులు వివరించారు.

సినిమాలు **దానవాయిపేట:** శ్యామల: వేట్టయన్, సూర్యప్యాలస్, స్వామి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్: వెనమ్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, సూర్యమినీ: జనక అయితే గనక, శివజ్యోతి: పొట్టేల్, ఊర్వశి: లగ్గం, మేనక: నరుడి బ్రతుకు నటన.

28 నుంచి వారోత్సవాలు

దేవీచౌక్: రాజమహేంద్రవరం తపాలా డివిజన్ పరిధిలో ఈ నెల 28 నుంచి నవంబరు 3 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు.



నర్సరీ రంగంలో నిత్యకృషీవలుడు పుల్లా చంటియ్య



సీఎం చంద్రబాబుకు మొక్కను అందిస్తున్న పుల్లా సత్యనారాయణ (పాత్రచిత్రం)

కడియం: నిత్యకృషీవలుడిగా నర్సరీరంగంలో తనకుంటూ ప్రత్యేక స్థానాన్ని శ్రీసత్యదేవా నర్సరీ అధినేత, కడియపులంక సర్‌ఆర్థర్‌కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ(చంటియ్య) సంపాదించారని నర్సరీరైతులు ముక్తకంఠంతో అన్నారు. కడియపులంకలో ఇటీవల ఆయన అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు భార్య మహాలక్ష్మి, కుమారుడు పుల్లా పెద్ద సత్యనారాయణ, కుమార్తెలు పిండి కనకదుర్గ, సంగిసెట్టి వరలక్ష్మి ఉన్నారు. విలాసవంతమైన జీవితానికి ఏమాత్రం ఆయన బానిస కాక నిత్యశ్రామికుడై జీవించిన తీరు అందర్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. ఆయన మృతికి నివాళిగా నర్సరీల లావాదేవీలకు ఒక్కరోజు సెలవు ప్రకటించారు. పుల్లా చంటియ్య మృతితో నర్సరీరంగం ఓ పెద్దదిక్కుని కోల్పోయిందని మంత్రి దుర్గేశ్ అన్నారు. నర్సరీరంగంలో పుల్లా చంటియ్య గౌరవడాక్టరేట్‌తో పాటు ఎన్నో అవార్డులు, పురస్కారాలు పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అందుకున్నారన్నారు.

ఐఆర్ ప్రకటించి వేతన సవరణ చేయాలి

కడియం: వైద్యఆరోగ్యశాఖలోని ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించి 12వ వేతన సవరణ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిదిండి రవికుమార్ కోరారు. గత అయిదేళ్లలో అన్ని విధాలా నష్టపోయారన్నారు. ప్రస్తుతం ఉద్యోగుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. ముఖ ఆధారిత హాజరు విషయంలో గ్రామీణ ప్రాంతాల వారికి 30నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని కోరారు.

ఆసక్తికరంగా ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

కొండగుంటూరు (రాజానగరం), న్యూస్‌టుడే: కొండగుంటూరులోని పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ పునశ్చరణ శిక్షణా శిబిరాన్ని జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి శుక్రవారం సందర్శించి, శిక్షణ నిర్వహిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పాఠశాల సంసిద్ధతా కార్యక్రమంపై శిక్షకులు తయారు చేసిన కృత్యాలను ఆమె పరిశీలించారు. ప్రాథమికస్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్తంగా చేపట్టాయని ఏఎమ్ఓ గౌరీశంకర్ తెలిపారు. డీఈఓ వాసుదేవరావు, డీఓఈఓ నారాయణ సందర్శించి ఉపాధ్యాయులకు భోజనం, వసతి సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయో లేవో పరిశీలించారు.

వ్యవసాయశాఖలో పదోన్నతులు

సీతానగరం: సీతానగరం మండల వ్యవసాయ విస్తరణాధికారి పీవీ శ్రీనివాస్‌కు వ్యవసాయాధికారిగా పదోన్నతితో పెద్దాపురం బదిలీ అయ్యారని ఏవో సూర్యరమేష్ శుక్రవారం తెలిపారు. చినకొండేపూడి రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు ఎన్.గురుప్రియకు సీతానగరం క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిగా పదోన్నతితో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారన్నారు.

ముగిసిన దంత వైద్య శిబిరం

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం ముగిసింది. రెండో రోజు శిబిరంలో 300 మందికి దంత వైద్య పరీక్షలు, 68 మందికి చికిత్సలు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వల్లీమాధవి తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.కాళీ కృష్ణ, ఏఓ బీహెచ్.ఎస్ రాజు, జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ గంటా సునీల్, హెచ్ఓడీ రూపేష్, అధ్యాపకురాలు డా. మౌనిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుగణన అవసరం

బొమ్మూరు: గ్రామీణ ప్రాంతాల్లో పశువులను ఆధారం చేసుకుని జీవించే రైతులు ఉన్నారని రాజవోలు మండల పశువైద్యాధికారి పి.వెంకటరావు తెలిపారు. రాజవోలు వైద్యశాలలో 21వ అఖిల బారత పశుగణన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, ఇతర జంతువుల వివరాలు సేకరిస్తారని తెలిపారు. సహాయకులు వీరయ్య, ఆశదీప, నాగుదుర్గ పాల్గొన్నారు.

సాయిచైతన్యనగర్‌లో అన్నసమారాధన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: నగర పరిధిలోని 10వ డివిజన్ మోరంపూడి సాయిచైతన్యనగర్‌లోని శ్రీవిజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన జరిగింది. శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వైకాపా నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, షర్మిలా రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, అన్నసమారాధనను ప్రారంభించారు.



































ముగిసిన విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ శుక్రవారం ప్రకటించారు. ఈ పోటీల్లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి స్థానాన్ని, జి.మామిడాడలోని డీఎల్ రెడ్డి కళాశాల ద్వితీయ, పెనుగొండలోని ఎస్వీకేపీ కళాశాల తృతీయ, ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల నాల్గవ స్థానాన్ని సాధించారని ప్రకటించారు. క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి హాజరైన 13 టీమ్‌లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారుల నుంచి ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను, అదనంగా మరో నలుగురు క్రీడాకారులను నన్నయ విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారని రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తెలిపారు. ఈ జట్టు నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. నిర్వహణ కార్యదర్శి డా.ఎం.వి.ఎస్.ఎస్. మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు, వైల్డ్‌క్యాట్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు పీఈఆర్ కళాశాల పీడీ రమణ, కోర్స్ కోఆర్డినేటర్ డా.కె.బాలసత్యనారాయణ, డా.ఎ.సత్యనారాయణ, డా.టి.రామ్‌గోపాల్, డేవిడ్, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.


ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయ జట్టుతో రిజిస్ట్రార్ సుధాకర్

విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

రాజానగరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్రప్రదేశ్ వారు ఈ నెల 27, 28 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్యసాయి పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన గోడపత్రికను నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న విద్యార్థి సమ్మేళనంలో రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఏబీవీపీ విశ్వవిద్యాలయ శాఖ అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాలుకు)	ధర (రూపాయల్లో)
కొత్తకాయ	11,500
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కురిడీ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి)	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె 15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

కాలుష్య పరిశ్రమ మూసేవరకు పోరు ఆగదు


దీక్షకు మద్దతుగా గుమ్మళ్లదొడ్డి రామాలయం వద్దకు తరలివచ్చిన గ్రామస్థులు

గోకవరం: అస్సాగో ఇథనల్ పరిశ్రమ మూసే వరకు పోరుబాటను వీడేది లేదంటున్నారు గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, వెదురుపాక, బావాజీపేట గ్రామస్థులు. రోజుల తరబడి శాంతియుతంగా పోరాటం చేస్తుంటే అధికారులు పట్టలేదని ఆందోళన శిబిరాన్ని స్వచ్ఛంద బందుకు సహకరించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా మరోతి శివ గణేష్, పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవిలు చేస్తున్న దీక్ష నాలుగో రోజుకు చేరింది. అదే సమయంలో దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారంతా రామాలయంలోకి వెళ్లి తలుపులు వేసుకొనే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం తలుపులు వేసుకొని లోపలే దీక్షను కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కారంపై హామీ ఇవ్వాలన్నారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలంటూ శుక్రవారం సాయంత్రం ఏఎస్పీ సుబ్బరాజు, సీఐ రాంబాబు దీక్షలు చేస్తున్న వారితో మైక్ ద్వారా చర్చలు జరిపారు. దీక్షా శిబిరంతో పాటు ప్రధాన రహదారిపైన పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



రంగంపేట: పోలీసులు చేసిన ప్రాణత్యాగాలు మరువలేనివని తెలుపుతూ శుక్రవారం రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యతలు సైకతాన్ని రూపొందించారు.


వేమగిరి గ్రామసభలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు

రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కడియం, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ చిన్నరాముడు సూచించారు. వేమగిరిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్, పేరుమార్పులు, అడంగల్, ఆర్‌ఓఆర్-1బీ వంటి సేవలను రైతులు పొందవచ్చన్నారు. తహసీల్దారు పోసిబాబు, స్థానిక వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు పశువుల ఆసుపత్రి వద్ద ఉచిత పశువైద్య శిబిరం, పశుగణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పశువైద్యాధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఆదుకునే పరిరక్షణ కాలంలో పశువులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఇన్ని పెట్టి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రైతు తమ ఇంటి వద్దకు వచ్చిన సిబ్బందికి అన్ని వివరాలు తెలిపి సహకరించాలన్నారు. అనపర్తి ఏడీఏ వై.శ్రీనివాసరావు, కూటమి నాయకులు చిట్టిబాబు చౌదరి, త్రిమూర్తులు, వాసు తదితరులు పాల్గొన్నారు.


పశుగణన కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

- సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అందుకు పశువైద్యులు ప్రవీణ్ ఉదాహరణ అని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద తెదేపా నాయకుడు చిట్టిబాబు చౌదరి ఆధ్వర్యంలో రైతులు ప్రవీణ్‌ను సన్మానించారు.

కూటమితోనే అభివృద్ధి పరుగులు

కోరుకొండ: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. గోకవరం నుంచి వయా కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును తన సతీమణి వెంకటలక్ష్మితో కలిసి శుక్రవారం కోరుకొండలో జెండా ఊపి ప్రారంభించారు. బస్సు ఎక్కి టిక్కెట్టు తీసుకుని కొంత దూరం ప్రయాణించారు. గత వైకాపా హయాంలో విధ్వంసకర పాలనతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఆర్టీసీ డీఎం రామన్న, కర్రి లక్ష్మీసరోజ, కర్రి గణేష్, రొంగల శ్రీనివాసరావు, కటకం చలం, బద్దిరెడ్డి దొర, మాతా ప్రభు, తాటికొండ శ్రీను, తాటికొండ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


కోరుకొండలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించడానికి టికెట్ అడుగుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

దానవాయిపేట: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ ఆధ్వర్యంలో డిప్లమో పారామెడికల్ కోర్సుల (కన్వీనర్ కోటా) దరఖాస్తు గడువు నవంబరు మూడో తేదీ వరకూ పొడిగించినట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబరు 12వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 73373 62530, 79950 13422 నంబర్లనుగాని, బొల్లినేని మెడ్ స్కిల్స్ పారామెడికల్ ఇనిస్టిట్యూషన్, రాజమహేంద్రవరం కిమ్స్ ఆసుపత్రిలోగాని సంప్రదించాలని సూచించారు.

దుకాణాల ఏర్పాట్ల పరిశీలన

అనపర్తి గ్రామీణం: అనపర్తిలో బాణసంచా దుకాణాల ఏర్పాట్లను అనపర్తి సీఐ సుమంత్, ఎస్సై శ్రీను నాయక్ అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. నిబంధనలకనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని, వాటి వద్ద ఇసుక, నీరు ఉంచాలని సూచించారు.

పశుగర్భ పరీక్షలకు అల్ట్రా సౌండ్ యంత్రం

బిక్కవోలు: పశువులు చూడి కట్టాయా.. లేదా అని తెలుసుకోవడానికి అల్ట్రా సౌండ్ యంత్రాలు వచ్చాయి. దాదాపు రూ.13 లక్షల విలువైన ఈ యంత్రాన్ని రాష్ట్ర పశుసంవర్ధక శిక్షణా సంస్థ మండపేటకు సరఫరా చేసింది. దీన్ని శుక్రవారం బిక్కవోలులో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఉపయోగించారు. డా. ప్రసాద్ దీనిపై శిక్షణ పొంది పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ యంత్రం వాడకం వల్ల నెలరోజుల చూలు కూడా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన




కోటికేశవరం(కోరుకొండ): కోటికేశవరం లోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం క్షేత్ర సందర్శన చేశారు. రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర సందర్శనకు వచ్చి వరిలో లింగాకర్షణ బుట్టల ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అభ్యుదయ రైతులు ఎం.వీరభద్రరావు, ఎం.సతీష్‌లతో కలిసి విద్యార్థులు జి.మహేష్, బి.వంశీ, సీహెచ్ నవీన్, కె.సాయికిరణ్, జి.మహేష్ రైతులకు పలు అంశాలపై వివరించారు. బుట్టల ఉపయోగంతో తెల్లదోమ, రసం పీల్చు పురుగుల ఉద్ధృతి తగ్గుతుందని, సాగు ఖర్చులు తగ్గించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్.వి.నరసింహారావు, డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఎప్పటికప్పుడు తమకు అందించే సూచనలు ఎంతో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు తెలిపారు.

నియోజకవర్గ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

అనపర్తి గ్రామీణం: అనపర్తి ఎస్ఎన్ఆర్ కల్యాణమండపంలో శుక్రవారం నియోజకవర్గంలోని అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. పరిపాలన సక్రమంగా సాగాలనే ఆలోచనతో, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ముగ్గళ్ల అక్రమ ఇసుక తవ్వకాలపై ముదిరిన వివాదం



సీతానగరం, న్యూస్‌టుడే: గోదావరి తీరంలోని ఏటిగట్టు గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ యంత్రాంగం చేసే ప్రయత్నాలను ఇసుకాసురులు తిప్పికొడుతున్నారు. సీతానగరం మండలంలోని ఎటువంటి అనుమతులు లేని ముగ్గళ్ల ఇసుక రేవులో నీటి ప్రవాహాన్ని దాటుకొని శుక్రవారం ఇసుక అక్రమ తవ్వకాలను చేస్తూ ట్రాక్టర్లపై తరలిస్తుండగా ఫీల్డ్‌మెన్ కోఆపరేటివ్ దళిత సంఘం సభ్యులకు ఇసుకాసురుల మధ్య ఘర్షణ నెలకొంది. 18 మంది దళిత రైతులకు చెందిన భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ ఆ సంఘం ప్రధానకార్యదర్శి మట్టాడి వెంకటరమణ రేవు వద్దకు వెళ్లి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలోనే రాము అనే ఇసుక ట్రాక్టరు నిర్వాహకుడు ట్రాక్టరుతో ఢీకొట్టి వేగంగా వెళ్లడంతో తన కాలుకు తీవ్ర గాయమైందని వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి చేరిన రెవెన్యూ, పోలీసులు అనుమతులు లేనిచోట తవ్వకాలు చేసిన ఇసుకను ట్రాక్టర్లపైనుంచి అన్‌లోడింగ్ చేయించారు. మండలంలో వంగలపూడి-1, 2, ములకల్లంక మూడుచోట్ల ఓపెన్‌రీచ్‌లకు అనుమతులు ఇచ్చారని ప్రస్తుతం అక్కడ కూడా కలెక్టర్ ఆదేశాలతో తవ్వకాలు నిర్వహించడం లేదని తహసీల్దారు అంకం శ్రీనివాసు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గోదావరి నదీగర్భంలో ట్రాక్టర్లను దించేందుకు అనుమతులు లేవని వాగులు, వంకల్లోనే ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతులు ఉన్నాయన్నారు. ఎడ్లబండ్లకు అనుమతులు ఉన్నాయన్నారు. 28 కిలోమీటర్ల పొడవునా ఇసుక అక్రమ తవ్వకాలు నిరోధించేలా రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. కోరుకొండలోని జనసేన పార్టీ కార్యాలయంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన 11 మంది బాధితులకు రూ.10.72 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మేడిశెట్టి శివరాం తదితరులు పాల్గొన్నారు. ● తూర్పుగోనగూడెంలో గల్లా వెంకటరత్నానికి రూ.2,00,202లు, చొల్లంగి బూరయ్యకు రూ.1,05,227లు, భూపాలపట్నంలోని పలివెల గోవిందరాజుకు రూ.70వేలు విలువైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్పీఎఫ్ ప్రతిభ



విజేతలుగా నిలిచిన సిబ్బందితో కమాండెంట్

దానవాయిపేట(రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్) 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20 నుంచి 23 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం ఎస్పీఎఫ్ జోన్ పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిందని దళం కమాండెంట్ కొండా నరసింహారావు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం కార్యాలయంలో విజేతలను అభినందించారు. అసిస్టెంట్ కమాండెంట్ ప్రసాద్‌రావు, శ్రీనివాసరావు, కృష్ణయ్య, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ రోడ్డుకు మోక్షం



మరమ్మతులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో కీలకమైన కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు మరమ్మతు పనులకు శుక్రవారం అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ ఇప్పటికే రూ.600 కోట్లతో ఒకటి, రూ.900కోట్లతో మరొకటి ప్రతిపాదనలు, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్‌లో రహదారిని అభివృద్ధి చేసేందుకు మరొకటి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రహదారి నిర్మాణం చేపట్టేలోపుగా రూ.6.35 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు. మరో రూ.55 కోట్లు సెంట్రల్ రోడ్డు ఫండ్ నుంచి మంజూరు చేయించి సామర్లకోట నుంచి వేమగిరి వరకు ఒక లేయర్ రోడ్డు వేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేసే ఆలోచనతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఈ రోడ్డు అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

మద్యం నిషేధించాలని రైతుకూలీ సంఘం డిమాండ్

రాజానగరం, న్యూస్‌టుడే: సమాజాన్ని నాశనం చేస్తున్న మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజానగరంలో ధర్నా నిర్వహించారు. ఆర్‌సీఎస్ ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీతో రాష్ట్రంలో బెల్టు షాపులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సూరిబాబు,కన్నబాబు, ఎమ్.బాబు, భూషణం, సత్తిబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంజిబాబు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు తీర్చేందుకు కార్యాచరణ



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, కడియం, టి.నగర్: తాగునీటి కష్టాలను తీర్చేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటా కొళాయి ఏర్పాటు కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి తెలిపారు. ధవళేశ్వరంలో జరిగిన పల్లెపండగలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. గత పాలకులు ఈ పనులు పట్టించుకోనందున నిధులు వెనక్కి మళ్లాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రూ.50 లక్షలతో నూతన యూనిట్‌బ్లాక్‌ను, రూ.కోటి 10లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మత్సేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కుమార్, పండూరి అప్పారావు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు. ● పట్టభద్రుల ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. ప్రియాంక గార్డెన్స్‌లో జరిగిన ఎన్నికల సమాయత్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అఖండ విజయాన్ని అందించాలన్నారు. నవంబరు 6వ తేదీ వరకూ ఓటు నమోదు ప్రక్రియ జరుగుతుందని, కార్యకర్తలే పార్టీ విజయానికి మూల స్థంభాలన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

తూ.గో.జిల్లా, రాజానగరం మండలం, జి.యర్రంపాలెం గ్రామం డో.నెం. 3-102 నివాసస్తులు ఉద్దండి సూర్యారావు గారి కుమారుడు అర్జున్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటుకు సంబంధించిన ఆస్తి అనగా తూ.గో.జిల్లా, మండపేట మండలం, ద్వారపూడి గ్రామం తాలూకు ఆర్.ఎస్.నెం 10/1, 6వ బ్లాక్‌కు సంబంధించి బంగాళా పెంకుటిల్లు డో.నెం. 6-87ను కలిగియున్నారు. సదరు ఆస్తి ది.27-7-2020 సం.న నా క్లయింటు లేటు సూరవరపు సత్యనారాయణ గారి భార్య లక్ష్మిగారి నుండి డాక్యుమెంట్ నెం. 1637/2020గా అనపర్తి సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు నందు సెటిల్‌మెంట్ డీడ్ పొందియున్నారు.

నా క్లయింటు సదరు డాక్యుమెంటుతోపాటు లింక్ డాక్యుమెంట్స్‌తో కలిసి, బ్యాంక్ నందు తనఖా పెట్టుటకు అన్ని డాక్యుమెంట్లు జిరాక్స్ తీయించుటకు ది. 21-10-2024న జి.యర్రంపాలెం నుండి పిడింగొయ్యి మీదుగా రాజమండ్రి మోరంపూడి వద్దకు మోటారు సైకిల్‌పై వచ్చి తన ఆస్తి తాలూకు మొత్తం డాక్యుమెంట్లను జిరాక్స్ తీయుట జరిగినది ఆ సమయంలో సదరు ఆస్తికి సంబంధించిన డాక్యుమెంటు నెం. 1694/1997గా రిజిష్టర్ అయిన డాక్యుమెంటు కనబడలేదు.

అన్ని డాక్యుమెంట్లులో సదరు డాక్యుమెంట్లలో సదరు డాక్యుమెంటు నా క్లయింటు మార్గమధ్యలో పడిపోయి ఉండవచ్చునని. అనేకమార్లు రాజమండ్రి, మోరంపూడి సెంటర్ నుండి పిడింగొయ్యి మీదుగా వెదికిన ఫలితం కనిపించలేదు. సదరు డాక్యుమెంటు నెం. 1694/1997ను ఎవరికైనను దొరికినను, లేదా ఎవరి వద్ద వున్న ఆచూకి తెల్పినను నా క్లయింటు సమాచారం ఇచ్చినవారికి లేదా సదరు డాక్యుమెంటు మా క్రింద ఆఫీసుకు ఇచ్చినను తగిన బహుమానం ఇవ్వబడునని తెలియజేయడమైనది.

జి.మోహన్ వంశీ, వి.ఎస్.ఎస్.శ్రీనివాస్
యు.రమాభారతి, అడ్వకేట్స్
దానవాయిపేట, రాజమహేంద్రవరం
సెల్ : 9441485759

హెచ్చరిక ప్రకటన

నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం, డో.నెం. 1-2-11/3, **కొమ్మోజు అప్పలాచార్యులు,** వయస్సు 80 ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

కోరుకొండ గ్రామంలో (లేటు) **కొమ్మోజు సూర్యం,** తండ్రి: (లేటు) **నారాయణమ్మ** ద్వారా డో.నెం. 4-61ఎ యిల్లు ఖాళీ స్థలం సుమారు 1000 చదరపు గజములు (2) **గుగ్గిలం దొరయ్య** గారి ద్వారా క్రయం పొందిన సర్వే నెం. 43/67 లో ఎ. 1-65 సెంట్ల మెట్ట భూమి 3) డో.నెం. 4-61ఎ స్థలం తూర్పు రోడ్డును ఆనుకొని సుమారు 160 చదరపు గజములు యింటి స్థలం కల్గి ఉన్నారు. ఈ ఆస్తులన్ని (లేటు) సూర్యం గారి సంతానం అయిన **నరసింహాచార్యులు, అప్పలచార్యులు, సత్యనారాయణ చార్యులు, విమల,** గంగాభవాని మరియు కమల గార్లకు 6 భాగములుగా సమాన హక్కుదారులై ఉన్నారు. 1984లో కొమ్మోజు అప్పలచార్యులు వారి అమ్మ గారు మరియు తమ్ముడు దస్తావేజు నెం. 511/84 సం॥ విశాఖ SRO లో నరసింహాచార్యులు గార్కి GPA యిచ్చి ఉన్నారు. ది. 13-11-2006లో నారాయణమ్మ గారు కోరుకొండ SRO స్థలం మరియు 2012న EO కోరుకొండ వార్కి దరఖాస్తులు చేసుకొని GPA ను రద్దు చేసి వీలునామా వ్రాసియున్నారు. (లేటు) కొమ్మోజు నరసింహచార్యులు రద్దుచేసిన GPA ను ఉపయోగించి పై 1, 2, 3 ఆస్తులను ఇతరులకు కొమ్మోజు నరసింహచార్యులు గారి కుమారుడు, కుమార్తెలు విశాఖపట్నంలో ఉన్న శేఖర్, ద్రాక్షారామంలో కమల, రాజమండ్రిలో ఉన్న లలితకు వ్రాసి ఉన్ననూ అవి చెల్లనేరవు. ఎవరికి ఏవిధమైన హక్కులు లేవు అని, అవి చెల్లవని తెలియపర్చడమైనది. పై ఆస్తులను సదరు శేఖర్, కమల, లలిత జరుపు అమ్మకాలు, తనఖాలు చేసిన యెడల నష్టపోవుదురు మరియు నా క్లయింటు తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు అని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

కానూరి వెంకటరావు
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
25-10-2024 సెల్: 9848363423